## క్లుప్తంగా

### ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవాలి


ఖాజపాషా

దోమ: బంగ్లాదేశ్‌లో హిందువులు, మైనార్టీల రక్షణకు ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకోవాలని దోమ మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఖాజపాషా అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న అల్లర్లను అదుపుచేసి, అల్లరిమూకలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా అన్ని దేశాల ఎంబాసీలు బంగ్లాలో శాంతియుత పరిస్థితులు నెలకొల్పేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి

పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి


రైతులకు స్వీట్లు తినిపిస్తున్న పరశురాంరెడ్డి

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి ప్రభుత్వమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి అన్నారు. రెండు లక్షల వరకు రుణమాఫీ చేయడంతో ఆదివారం మండలంలోని సయ్యద్‌పల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి, రైతులు స్వీట్లు తినిపిచ్చుకొని సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా మన రాష్ట్రంలో ఏకకాలంలో రెండు లక్షల వరకు రుణమాఫీ చేసిందన్నారు. కాంగ్రెస్ మాట ఇచ్చిందంటే తప్పకుండా నెరవేర్చుతుందని చెప్పారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రైతులను మోసం చేసిందని విమర్శించారు. ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో సగానికి పైగా అమలు అవుతున్నాయని, మిగ తావి కూడా అమలు చేస్తామన్నారు. కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గణేష్, నరసింహారెడ్డి, అన్వర్, రాములు, నర్సింహులు, రాజు, రాములు పాల్గొన్నారు.

### కఠినంగా శిక్షించాలి


వికారాబాద్‌లో ముస్లిం యువకుల ర్యాలీ

అనంతగిరి: కోల్‌కతాలోని వైద్య విద్యార్థిపై అఘాయిత్యానికి పాల్పడి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని పలువురు ముస్లి మైనార్టీ యువకులు డిమాండ్ చేశారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలో యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**కొవ్వొత్తుల ర్యాలీ**


పెద్దేముల్: ర్యాలీలో పాల్గొన్న యువకులు

పెద్దేముల్: కోల్‌కతా నగరంలో జూనియర్ వైద్యు రాలిపై అత్యాచారం, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని పలువురు యువకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో యువకులు హనుమాన్ దేవాలయం నుంచి బస్టాండ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

### రేపటి నుంచి ఆరాధనోత్సవాలు

కొడంగల్ : పట్టణంలో వెలసిన గురు రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్నాయి. 20, 21, 22 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు డీడీఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారి, అర్చకులు అక్కి శ్రీనివాసామూర్తి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 20న ఉదయం సుప్రభాతం, పంచామృతాభిషేకం, అష్టోత్తర పారాయణం, తులసీ అర్చన, పల్లకీసేవ, అష్టావధానం, 21న ఉ.10 గంటలకు రథోత్సవం, 22న భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

### పుస్తెమెట్టెలు అందజేత

కేశంపేట: పేదింటి అమ్మాయిల పెళ్లిళ్లకు మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి పుస్తె, మెట్టెలను అందజేశారు. మండలంలోని పాపిరెడ్డిగూడకు చెందిన అబ్బి లక్ష్మయ్య, పద్మ, గౌతా పురం రాంచంద్రయ్య, రాణి దంపతుల కుమార్తెల వివాహాలకు పుస్తె, మెట్టెల అందజేశారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, నరేందర్, శేఖర్ రెడ్డి, కుమ్మరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఏళ్ల తరబడి వెట్టిచాకిరీ!

గ్రామపంచాయతీ పాలనలో కారోబార్ల విధి నిర్వహణ అత్యంత ముఖ్యం. పంచాయతీల్లో కీలకపాత్ర పోషిస్తున్న కారోబార్ల జీవితాల్లో సంవత్సరాలు గడుస్తున్నా వెలుగులు మాత్రం కానరాని పరిస్థితి నెలకొంది. కొన్ని దశాబ్దాలుగా పనిచేస్తూ ఎప్పటికైనా తమను గుర్తించకపోతారా అనే ఆశతో ఎదురుచూస్తూ.. చాలీచాలని జీతాలతో పనిభారం ఎక్కువవుతున్నా భరిస్తూ విధులు నిర్వహిస్తున్నారు.

- కనుమరుగవుతున్న కారోబార్లు
- గుర్తింపు ఉండదు.. గౌరవ వేతనం పెరగదు..
- ప్రత్యేక గుర్తింపునివ్వాలని వేడుకోలు


కుల్కచర్ల గ్రామపంచాయతీ కార్యాలయం

కుల్కచర్ల: గ్రామపంచాయతీ పరిధిలో మురుగుకాల్వలు శుభ్రం చేయించడం, చెత్తను సేకరించడం, తాగునీరు సరఫరా, దండోరా వేయించి ప్రజలకు సమాచారం ఇవ్వడం.. గ్రామపంచాయతీ కార్యాలయ నిర్వహణ వంటి ఎన్నో పనులు చేస్తున్నా కారోబా ర్లను ప్రభుత్వాలు పట్టించుకున్న పరిస్థితి కనిపించదు. గత 35సంవత్సరాలుగా కారోబార్ల వ్యవస్థ కొనసాగుతున్న పరిస్థితి ఉండగా నాడు నెలకు రూ.2,500 నుంచి పనులు చేస్తున్నారు. ప్రస్తుతం చెల్లిస్తున్న జీతం రూ. 8500 మాత్రమే. కొన్ని గ్రామ పంచాయతీలలో 5వేలకు పరిమితం.

**కొత్తపంచాయతీల ఏర్పాటుతో ఇబ్బందులు..**

అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి.. కారోబార్లను మల్టీపర్పస్ వర్కర్లుగా పేరు మార్చి వారిని అన్ని పనులకు వినియోగించుకుంటోంది. గతంలో కుల్కచర్ల మండల పరిషత్‌లో 38మంది కారోబార్లు విధులు నిర్వహించేవారు. ఇప్పటికీ వారు విధులు కొనసాగిస్తూనే ఉన్నారు. కొత్త గ్రామపంచాయతీల్లో కొందరిని మల్టీపర్పస్ వర్కర్లుగా తాత్కాలికంగా నియమాకాలు చేసుకున్నారు.

**గౌరవ వేతనం అందక..**

ఉపాధిహామీ పనులు చేసే కూలీలకు రూ.300 అందిస్తున్న క్రమంలో గ్రామపంచాయతీల్లో కార్యదర్శి తరువాత అన్ని విధాలుగా పని చేస్తున్న కారోబార్లకు కనీస వేతనం రూ.8500/-గానే ఉంది. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న తమకు కనీసం ఉపాధి కూలీలకు అందించే కూలీ కూడా ఇవ్వకపోవడం బాధకరమన్నారు. నూతనంగా కార్మికులుగా చేరిన వారికి కూడా ఇదే జీతాన్ని అందిస్తున్నారని, ఏళ్ల తరబడి వెట్టి చేసినా ప్రత్యేక గుర్తింపులేకపోవడం ఇబ్బందికరమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని డిమాండ్**

గ్రామపంచాయతీల్లో కీలకంగా పనిచేస్తున్న తమకు ప్రత్యేక గుర్తింపునిస్తూ గౌరవ వేతనాన్ని పెంచాలని కారోబార్లు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతున్నారు.


కార్మికులతో పనులు చేయిస్తున్న కారోబార్(ఫైల్)

24గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండే తమను ప్రభుత్వం గుర్తించి, వేతనం పెంచి తమ కుటుంబాలు రోడ్డున పడకుండా చూడాలని వేడుకుంటున్నారు.

### న్యాయం చేయాలి



గ్రామపంచాయతీ పాలనలో కార్యదర్శి తరువాత కష్టపడే తమను ప్రభుత్వం గుర్తించాలి. నిరుపేద కుటుంబాలకు చెందిన వారే అధికంగా కారోబార్లుగా విధులు నిర్వహిస్తున్నారు.ప్రభుత్వాలు కారోబార్ల వ్యవస్థను బలోపేతం చేసి, ప్రత్యేక గుర్తింపునిస్తూ వేతనాలు పెంచాలి.

– యాదయ్య, కారోబార్ల మండల సంఘం అధ్యక్షుడు

### 20ఏళ్లుగా పనిచేస్తున్నా..



20ఏళ్లుగా గ్రామపంచాయతీలో కుల్కచర్ల జీపీ కారోబార్‌గా పనిచేస్తున్నా. అప్పట్లో రూ.2500 ఇచ్చేవారు. కొన్నాళ్ల తరువాత రూ.5వేలు ఇచ్చారు. ప్రస్తుతం 8500 ఇస్తున్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా తమను చిన్నచూపుతో చూడటం ఆవేదనకరం. తమ సర్వీసును చూసి జీతం చెల్లిస్తే మూడుపూటల తినగలుగుతాం. ప్రజలకు సేవలు అందించేందుకు మరింత ఉత్సాహంతో ముందుకుసాగుతాం.

– వెంకటయ్య, కుల్కచర్ల జీపీ కారోబార్

# సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు అదుపు

యాలాల ఎస్ఐ శంకర్


సీసీ కెమెరాలు అందజేస్తున్న నాయకులు

యాలాల: శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాల ఏర్పాటుతో కట్టుదిట్టమైన భద్రతను ఉంటుందని యాలాల ఎస్ఐ శంకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పేరి రాజేందర్‌రెడ్డి పీఎస్‌కు మూడు సీసీ కెమెరాలను స్థానిక నాయకులతో ఎస్ఐకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. శాంతిభద్రతల విషయంలో స్థానికుల సహకారం అవసరమన్నారు. నిఘానేత్రాలతో ఎన్నో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. రాజేందర్‌రెడ్డిని అడిగిన వెంటనే సీసీ కెమెరాలను అందించడం అభినందనీయమన్నారు. గ్రామంలోని ప్రధాన ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు నాగయ్య, మోయిజ్, నర్సింహులు, అశోక్, మారుతి, శ్రీనివాస్, మోయిజ్, లాలప్ప తదితరులు ఉన్నారు.

# అర్హులైన రైతులకు రుణమాఫీ


విలేకరులతో మాట్లాడుతున్న మొగులయ్య

పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

కుల్కచర్ల: అర్హులైన ప్రతి రైతుకు తప్పనిసరిగా రుణమాఫీ చేస్తామని కుల్కచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. చరిత్రలో కనీవినీ ఎరగని రీతిలో రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే చెందుతుందన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతులందరూ సంతోషంగా ఉన్నారని అన్నారు. ఎమ్మెల్యే మనో హర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్‌గా ఉన్నప్పటి నుంచి కుల్కచర్ల ప్రాథమిక సహకార సంఘాన్ని అభివృద్ధి దిశగా నడిపించారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సహకారంతో వాణిజ్య బ్యాంకులతో సమానంగా అన్ని విధాల ఆర్థిక లావాదేవీ లను కొనసాగిస్తామన్నారు. కుల్కచర్ల వ్యవ సాయ సహకార సంఘంలో రుణాలు తీసుకున్న 736మంది రైతులకు రూ. 5,1800020/– పూర్తిస్థాయిలో రుణ మాఫీ అయిందన్నారు. మొత్తం 1308మందికి 10కోట్ల 29 లక్షల రూపాయాల మాఫీ అవుతుందని తెలిపారు.

## పర్యాటకుల సందడి

ధారూరు: మండలంలోని కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. చిరుజల్లు కురుస్తూ ఆహ్లాదంగా ఉండటంతో సెల్ఫీలు, ఫొటోలకు ఫోజులిస్తూ ఎంజాయ్ చేశారు. కుటుంబ సమేతంగా పిల్లలతో కలిసి రోజంతా సంతోషంగా గడిపారు. యువతీ, యువకులు బోటింగ్ చేయడానికి ప్రాధాన్యం ఇచ్చారు.


బోటింగ్ చేస్తున్న యువత


నీటిలో కేరింతలు కొడుతున్న చిన్నారులు

## రాఖీ దుకాణాల్లో సందడి


రాఖీలు కొలుగోలు చేస్తున్న మహిళలు

అనంతగిరి: వికారాబాద్ కేంద్రంలో రాఖీల కోసం ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. రాఖీలు, బహుమతుల కొనుగోళ్లతో దుకాణాల్లో సందడి నెలకొంది. మహిళల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. అన్నదమ్ములకు రాఖీలు కట్టేందుకు అక్కాచెల్లెలు తమకు నచ్చిన రాఖీలు కొనుగోలు చేస్తున్నారు.

## కార్మికుల పొట్టగొట్టొద్దు..

కొడంగల్ రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హరే రామ హరేకృష్ణ స్వచ్ఛంద సంస్థకు మధ్యాహ్న భోజన బాధ్యతను అప్పగించి, కార్మికుల పొట్టగొట్టే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. కనీస వేతనం రూ.10వే లు ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షురాలు బి.లక్ష్మి, జయమ్మ, ఆశమ్మ, సులోచన, నర్సమ్మ పాల్గొన్నారు.

## మందకృష్ణను కలిసిన నేతలు

శంకర్‌పల్లి: మందకృష్ణ మాదిగను ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శంకర్‌పల్లి ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ.. మందకృష్ణ ఎస్సీ వర్గీకరణ కోసం 30ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేసిన యోధుడని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణతో మాదిగ ఉపకులాలకు లబ్ధి చేకూరుతుందన్నారు.

# క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలి

షాద్‌నగర్: విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని ట్రాఫిక్ ఎస్ఐ రవీందర్‌నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పద్మావతి కన్వెన్షన్ హాల్‌లో న్యూ మాంక్స్ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు ఆత్మరక్షణ కోసం యుద్ధ విద్యలు నేర్చుకోవడం కూడా ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా గ్రేడింగ్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన 30 మంది విద్యార్థులకు బెల్టు లు, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో న్యూ మాంక్స్ కుంగ్‌ఫూ రాష్ట్ర అసిస్టెంట్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ నక్క బాల్‌రాజ్, మాస్టర్లు రమేశ్, నరేశ్, ప్రిన్సిపాల్ నవీన్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి చేయూత

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని ఎలికట్ట గ్రామానికి చెందిన నక్క మాణెమ్మ శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న అంబా భవానీ పొదుపు సంఘం అధ్యక్షుడు సంజీవయాదవ్ ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. పొదుపు సంఘంలో నక్క మాణెమ్మ సభ్యురాలు కావడంతో సంఘం తరపున ఆర్థికసాయం అందజేసినట్లు సంజీవయాదవ్ తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రంగమ్మ, ఆశవర్కర్ లలిత, బద్దుల లక్ష్మయ్య, నక్క శ్రీశైలం, ఆర్ల లింగం, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.


నగదు అందజేస్తున్న సంఘం సభ్యులు


బొంరాస్‌పేట: పాపన్నగౌడ్ విగ్రహం వద్ద బీజేపీ నాయకులు


కుల్కచర్ల: గౌడ సంఘం ఆధ్వర్యంలో..

## బడుగుల ఆశాజ్యోతి పాపన్న

బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం జిల్లాలోని ఆయా గ్రామాల్లో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు గౌడ సంఘం ప్రతినిధులు, పలు రాజకీయ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రజాకార్ల, పెత్తందార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసి గోల్కొండ కోటను కదిలించిన పోరాటయోధుడని కొనియాడారు. –సాక్షి, నెట్‌వర్క్


తాండూరులో..


దౌల్తాబాద్‌లో..


దుద్యాల్ : లగచెర్లలో..


బంట్వారంలో..


పూడూరు: మన్నెగూడ చౌరస్తాలో..


అనంతగిరి: వికారాబాద్‌లో..

# కూలీల కొరత.. రైతుల వెత


వరినాట్లు వేస్తున్న కూలీలు

- ముమ్మరంగా సాగు పనులు
- కూలీలకు పెరిగిన డిమాండ్
- ఆటోలు, ట్రాక్టర్లలో తరలింపు

దౌల్తాబాద్: మండలంలో వానాకాలం సీజన్ పనులు ఆగస్టు మొదటివారం నుంచి ఊపందుకున్నాయి. వ్యవసాయ బావులు, వులను ఆధారంగా చేసుకుని వరినాట్లు వేస్తుండడంతో జూలైలో వేసిన వరినాట్ల కలుపునకు రావడం, పత్తిలో కలుపు తీయిస్తుండడంతో కూలీల కొరత ఏర్పడింది. దీంతో కూలీలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. మండలంలోని పలు గ్రామాల రైతులు వివిధ ప్రాంతాల నుంచి కూలీలను ఆటోలు, ట్రాలీ ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. సమయానుకూలంగా బస్సులు రాకపోవడంతో ఆటోల్లో పరిమితికి మించి కూలీలను తరలిస్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. మహిళా కూలీలకు మరింత డిమాండ్ పెరిగింది. ప్రధానంగా నందారం, ఇందాపూర్, యాంకి, దేశాయిపల్లి, గోకఫసల్‌వాద్, పోల్కంపల్లి గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రోజు కూలీ రూ.350 నుంచి రూ.400 వరకు చెల్లిస్తూ ఆటో కిరాయి రైతులే భరిస్తున్నారు. ఒకో ఆటోలో 12నుంచి 18మంది వరకు తరలిస్తున్నారు. కూలీల దొరకకపోవడంతో కొంతమంది రైతులు కుటుంబాలు వంతుల వారీగా పనులు చేసుకుంటున్నారు. కొంతమంది పంటల కలుపుతీత, వరినాట్లు వేసేందుకు అందరూ కలిసి ఒక్కొక్క రోజు ఒకరి పొలాలను వేసుకుంటున్నారు. చదువుకున్న వారు కూడా తల్లిదండ్రులతో కలిసి పంట చేలల్లో పనులకు వెళ్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో పత్తిలో కలుపు తీస్తున్నారు.

### కూలీలు దొరకడం లేదు



పత్తి, వరినాట్లు మొదలయ్యాయి. కూలీల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రైతులందరూ ఒకేసారి పనులు మొదలు పెట్టడంతో ఇబ్బంది ఏర్పడింది. రైతులు అందరూ పిలుస్తుండడంతో కూలీలు బిజీగా ఉన్నారు. దీంతో ఎక్కువ కూలీ చెల్లించి పొలాల్లో పనులు చేయించుకుంటున్నాం.

–రమేష్, రైతు, దౌల్తాబాద్